ARK MEDIA SUBSCRIBE

TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం | ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి | జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 148 | శుక్రవారం, జూన్ 19, 2026 | పేజీలు : 02 | వెల రూ. 1.00/-



విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754


# డీర్ పార్కులో ఘనంగా వన మహోత్సవం











### మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మేయర్, నగరపాలక సంస్థ కమిషనర్

**నేటి ప్రభాతదర్శిని కరీంనగర్ జూన్ 18 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు కరీంనగర్ నగరంలోని డీర్ పార్కులో బుధవారం సాయంత్రం ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పలువురు అధికారులు మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని అధికారులు పిలుపునిచ్చారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగాన్ని డీర్ పార్కులో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, అధికారులు తిలకించారు. అంతకుముందు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి సభను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, మెప్మా పీడీ స్వరూపారాణి, డీఆర్డీఓ గీత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, స్ట్రైక్ ఫోర్స్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీతో పాటు పలువురు అటవీశాఖ అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధుల విడుదలకు డేట్ ఫిక్స్..

## కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఉత్తమ్

జూన్ 30న రేవంత్ చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్న ఉత్తమ్

7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్టు వెల్లడి

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి



2

## నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు: కవిత

**నేటి ప్రభాత దర్శిని, హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. "నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను" అని కవిత వివరించారు. ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.



# రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్.. కేంద్రం నివేదికలో షాకింగ్ నిజాలు!

**ప్రధాన రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాల పెరుగుదల**
**2024లో 13.5 శాతం పెరిగిన యాక్సిడెంట్లు.. కేంద్ర నివేదిక వెల్లడి**
**ప్రమాదాలకు అతివేగమే ప్రధాన కారణమని గుర్తింపు**
**మరణాల వృద్ధిరేటులోనూ దక్షిణ భారతంలో తెలంగాణ టాప్**
**చిన్న ప్రమాదాల నమోదుతోనే సంఖ్య పెరిగిందంటున్న అధికారులు**



**నేటి ప్రభాత దర్శిని, ఢిల్లీ**

దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రహదారి ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 25,986కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధి రేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ప్రమాదాల్లో కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధి రేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగం వల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా, సుమారు 2,760 మంది మృత్యువాత పడ్డారు. వీటితో పాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనల కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదు కాని చిన్న చిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం మరియు ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# రైతు భరోసా నిధుల విడుదలకు డేట్ ఫిక్స్..

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఉత్తమ్**
**జూన్ 30న రేవంత్ చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్న ఉత్తమ్**
**7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్టు వెల్లడి**
**నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి**

**హైదరాబాద్ నేటి ప్రభాత దర్శిని**

తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది. జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను నేరుగా విడుదల చేస్తారు. మార్కెట్ డిమాండ్ మేరకు 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది" అని తెలిపారు. తెలంగాణ నుండి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడం సరికాదని అన్నారు.. ఎరువుల కోటా, రామగుండం యూరియాలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతులు, ఐఆర్ఎఫ్ సీ రుణాల విడుదలపై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లనుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇకపై అంతా డిజిటల్ కేబినెట్ నిర్వహిస్తామన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**బడిబాట కార్యక్రమం ద్వారా జిల్లాలో 3 వేల మంది కొత్త విద్యార్థులను చేర్పించాలి**
**అధార్ నంబర్ల నమోదు, యూడైస్ నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి**
**అన్అకాడమీ, ఫిజిక్స్‌వాలా ద్వారా ఉన్నత తరగతుల విద్యార్థులకు వారానికోసారి శిక్షణ అందించాలి**
**కేజీబీవీల్లో ఖాళీ సీట్లన్నీ భర్తీ చేయాలి**
**ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
**15 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న 120 పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**నేటి ప్రభాతదర్శిని పెద్దపల్లి, జూన్-18**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన ఉపాధ్యాయులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో పనిచేసిన విద్యా వాలంటీర్ల సేవలను ఈ విద్యా సంవత్సరంలోనూ కొనసాగిస్తామని తెలిపారు. అవసరమైతే స్థానికంగా విద్యా వాలంటీర్లను నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఏ పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధ్యాయులందరూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా 100 శాతం హాజరు నమోదు చేయాలని, ప్రతి రోజు హాజరు వివరాలను పర్యవేక్షిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సెలవుల మంజూరు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 10 శాతం పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3 వేల మంది కొత్త విద్యార్థులను చేర్పించాలని, ప్రతి మండలానికి 300 మంది విద్యార్థుల చేర్పు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 15 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న 120 పాఠశాలలు, సున్నా నమోదు ఉన్న 35 పాఠశాలలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అలాగే మోడల్ స్కూళ్లలో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. తక్కువ నమోదు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి అభార్ నంబర్ జనరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, యూడైస్ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. విద్యార్థుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్లను పూర్తిగా భర్తీ చేయాలని, అర్హులైన ఏ విద్యార్థి ప్రవేశాన్ని తిరస్కరించవద్దని ఆదేశించారు. కేజీబీవీల్లో వాచ్‌మెన్, ఉపాధ్యాయులు, వంట మనుషుల ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే నియామకాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఉన్నత తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యా, పోటీ పరీక్షల శిక్షణ అందించేందుకు వారానికి ఒకసారి అన్అకాడమీ, ఫిజిక్స్‌వాలా వంటి డిజిటల్ విద్యా వేదికల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్ వ్యవస్థలు, ఇంటర్నెట్ సౌకర్యాలు, ఇతర వనరులను వచ్చే పది రోజుల్లో సిద్ధం చేయాలని, కార్యక్రమాల షెడ్యూల్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాంప్లెక్స్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులే నివేదికల్లో ప్రతిబింబించాలని, తప్పుడు గణాంకాలకు తావు ఇవ్వొద్దని సూచించారు. తక్కువ ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలపై ఈ విద్యా సంవత్సరంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. ఏఎక్స్ఎల్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి శనివారం కాంప్లెక్స్ హెచ్ఎంలు సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సమీక్షల ద్వారా విద్యా ప్రమాణాల్లో గణనీయమైన మార్పు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో పకడ్బందీగా టైమ్‌టేబుల్ రూపొందించి అమలు చేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల సమస్యలను అధికశాతం పరిష్కరించినందున వచ్చే 45 రోజులు ప్రాథమిక విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జూలై నెల నుంచి అన్ని పాఠశాలలు పూర్తి స్థాయిలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని 48 ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు అవసరమైన నియామక ప్రక్రియ పూర్తయిందని, వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చిన్నారులకు విద్య ఆనందదాయకంగా ఉండేలా బొమ్మలు, విద్యా సామగ్రి అందుబాటులో ఉంచాలని తెలిపారు. నాబార్డ్ నిధులతో చేపడుతున్న విద్యా మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు సేవలందిస్తున్న భవిత కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన ఈ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేయాలని, బడిబాట కార్యక్రమంలో కూడా ఈ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి నెల విద్యాశాఖ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని, ఉన్నత పాఠశాలల్లో సిలబస్ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించని ఉపాధ్యాయులపై, ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు ఫోరమ్‌లను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో , అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.ఎం. షేక్, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం అందించాలి

**పానీ పూరి తిని అస్వస్థతకు గురైన పిల్లలు, పెద్దలు క్షేమం**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**లితంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీ లో పానీపూరి తిని చికిత్స పొందుతున్న పిల్లలు,**
**పెద్దలను పరామర్శించిన ప్రభుత్వ విప్?**
**పండ్లు పంపిణీ చేసిన విప్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ - 18**

పానీ పూరి తిని అస్వస్థతకు గురైన పిల్లలు, పెద్దలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పానీపూరి తిని దాదాపు 30 మంది పిల్లలు, తొమ్మిది మంది పెద్దలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు ఈ సందర్భంగా వారిని గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరామర్శించారు వారందరినీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా వివరాలు సేకరించారు. వీరిలో 8 మంది డిశ్చార్జ్ అయ్యారని వైద్యులు తెలిపారు. మిగతా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. స్థానికంగా చికిత్స పొందుతున్న అందరి ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారని ఎప్పటికప్పుడు వివరాలు చేరవేస్తున్నామని వెల్లడించారు. ప్రజారోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం పటిష్టచర్యలు తీసుకుంటుందని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఆహారపదార్థాలు విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామని వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పానీపూరి విక్రయించి పలువురు అస్వస్థతకు కారణమైన నిర్వాహకుడీ పై ఇప్పటికి కేసు నమోదు చేశామని ఆయనపై చర్యలు తీసుకుంటున్నాను స్పష్టం చేశారు. పిల్లలందరూ త్వరగా కోలుకుంటున్నారని త్వరలోనే పాఠశాలలకు తిరిగి వెళ్తారని పేర్కొన్నారు. ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సిబ్బందిని ప్రభుత్వ విప్ అభినందించారు. జిల్లాలో గత రబీ సీజన్ కంటే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అనుకూల పరిస్థితులతో జిల్లాలో దాన్యం దిగుబడి గతంలో కంటే చాలా పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



### వివిధ శాఖల ఆద్వర్యంలో తనిఖీలు..

జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తామని అధికారులు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ అలాగే ఆయా గ్రామాల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో సంయుక్తంగా చేస్తారని ఏమైనా లోపాలు ఉన్న నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ వేములవాడ మున్సిపల్ చైర్మెన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డాక్టర్లు సంతోష్ కుమార్, కపిల్ , జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.